సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



ముమ్మరంగా కంటి వెలుగు

రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభిస్తోంది.

వివరాలు 9లో ▸



వడ్ల బస్తాల్లో కంకర రాళ్లు

వడ్ల బస్తాల్లో కంకరరాళ్లు కలిపి విక్రయిస్తున్న ఘటన బాదేపల్లిలో వెలుగు చూసింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.0 /18.3

వాతావరణం

రాత్రివేళలో చలి తీవ్రత తగ్గుతుంది. క్రమంగా ఎండప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెడుతుంది.

యథేచ్ఛగా లిక్కర్ దందా..!

నదీ తీర గ్రామాలే అడ్డా

- అక్రమంగా నది దాటుతున్న కర్ణాటక మద్యం
- తుంగభద్ర నది మాటున అక్రమ మద్యం రవాణా
- నిఘా బృందాల కళ్లు కప్పి సరిహద్దులు దాటుతున్న వైనం



రాజోళి: అక్రమ మద్యం యథేచ్ఛగా సరిహద్దులు దాటుతుంది. మూడు రాష్ట్రాలను దాటుకుని వెళ్లి కిక్కు ఎక్కిస్తుంది. అధికారుల నామమాత్రపు దాడులతో దందా మూడు క్వాటర్లు, ఆరు హాఫ్‌లుగా సాగిపోతుందని వాదనలు వినిపిస్తున్నాయి. కర్ణాటకలోని రాయచూరు తదితర ప్రాంతాల నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చి మండలంలోని తుమ్మిళ్ల, చిన్నదన్వాడ, అయిజ మండలం వేణుసోంపురం గ్రామాల వద్ద తుంగభద్ర నదిని పుట్టీల ద్వారా దాటి సరుకును ఏపీకి తరలిస్తున్నారు. గతంలో ఏపీలో మద్యం ధరలు ఎక్కువగా ఉన్న సమయాన్ని అనువుగా చేసుకుని కర్నూల్ జిల్లాలోని పలువురితో కొందరు వ్యాపార సంబంధాలు ఏర్పాటు చేసుకుని దందాను సాగిస్తున్నారు. ప్రధానంగా నదీ తీర గ్రామాలకు చెందిన వారే ఎక్కువగా ఈ దందాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. గతంలో వైన్ షాపుల్లో పని చేసిన వారు కూడా ఈ దందాలో కొనసాగుతున్నారు.

90 ఎంఎల్ నుంచి మొదలు

కర్ణాటక నుంచి తెచ్చే మద్యంలో 90 ఎంఎల్ నుంచి క్వాటర్ల వరకు డిమాండ్ ఉన్న బ్రాండ్లను తీసుకువస్తున్నారు. తెలంగాణ, ఏపీలో అందుబాటులో లేని 90 ఎంఎల్ బాటిళ్లతో పాటు గోవా నుంచి కూడా చీప్ లిక్కర్లను తీసుకువస్తున్నారు. ఆయా గ్రామాల్లో దేవరలు, గ్రామ ఫంక్షన్‌లకు ఇలాంటి మందునే నేరుగా తీసుకువచ్చి ఇస్తున్నారు. ఈ దందా మొత్తం రాత్రి వేళల్లోనే జరుగుతుండటంతో అధికారులకు కూడా పట్టుబడటం లేదు. నది దాటేందుకు కూడా రోజూ ఒకే చోట కాకుండా అడ్డాలు మార్చి పుట్టీల్లో సరుకును తరలిస్తుండటంతో పట్టుకోవడం కష్టంగా మారుతుందని వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశాం



సరిహద్దులు దాటుతున్న అక్రమ మద్యాన్ని, దందాను ఆపేందుకు ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేశాం. సాధారణ ఎక్సైజ్ సిబ్బందితో పాటు, చెక్‌పోస్టు టీంలను ఏర్పాటు చేశాం. ఆ టీంలు ఎప్పటికప్పుడు సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ద్వారా మద్యం రవాణాను కట్టడి చేస్తున్నారు. అనుమానాలున్న చోట దాడులు చేసి కేసులు చేస్తున్నాం. నది తీర గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాం.

– సైదులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, గద్వాల

నామమాత్రంగా దాడులు..

కర్ణాటక మద్యాన్ని నియంత్రించడంలో సంబంధింత అధికారులు చేస్తున్న దాడులు నామమాత్రంగానే ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కర్ణాటక నుంచి తెస్తున్న మద్యాన్ని తెలంగాణలో అమ్మడం లేదు. అది కేవలం ఏపీకి మాత్రం వెళ్తుంది. దీంతో దందా అంతా చీకటిలోనే ఒక్కసారిగా జరిగిపోతుంది. మద్యాన్ని హోల్‌సేల్ గా నది దాటిస్తున్నారే తప్ప, స్థానికంగా అమ్మకాలు జరగడం లేదు. దీంతో అధికారులు ఏ సమయంలో దాడులు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఏపీ అధికారులు కూడా కర్ణాటక మద్యంపై కఠినంగా వ్యవహరించడం లేదని, సరిహద్దులో ఉండటం వల్ల జిల్లాకే చెడ్డపేరు వస్తుందని, సరిహద్దు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న వైన్ షాపులపై కూడా మన ఎక్సైజ్ అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదని, గ్రామాల్లో అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్న బెల్టు షాపులపై దాడులు చేయకపోగా, తెలంగాణ లిక్కర్ మాత్రమే అమ్మాలని, ఏ మండలంలో గ్రామాలు, ఆ మండలానికి చెందిన వైన్ షాపులోనే సరుకును కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

సరిహద్దులు దాటి..

గట్టు మండలంలోని బల్గెర చెక్‌పోస్టు దాటగానే కర్ణాటక రాష్ట్రం మొదలవుతుంది. దగ్గరలోనే రాయచూరు పట్టణం కూడా ఉండటంతో అక్కడి వ్యక్తులతో సంబంధాలున్న వారు ప్రత్యేక ఆటోలు, బొలేరేల్లో మద్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోకి తీసుకు వస్తున్నారు. ఈ సరిహద్దు దాటేందుకు వారు ఎన్నో అడ్డదారులు ఏర్పాటు చేసుకున్నారు. మారుమూల గ్రామాల మీదుగా, ఆర్‌డీఎస్ కెనాల్ మీదుగా వస్తున్నారు. బల్గెర, చింతలకుంట, . నందిన్నె, తలమారి, మిడ్జాపురం, బోయలగూడెం, తదిదర గ్రామాల మీదుగా సరిహద్దు దాటి చేరుకుంటున్నారు. అక్కడి నుండి వెంకటాపురం స్టేజీ , తనగల, పచ్చర్ల మీదుగా తుమ్మిళ్లకు చేరుకుంటారు. ఇంకొన్ని సార్లు పచ్చర్ల దాటుకుని మాన్‌దొడ్డి దాటి చిన్న దన్వాడకు చేరుకుని స్థానికంగా ఉన్న వారికి సరుకును అప్పగిస్తారు. వీరు నది వద్ద రోజుకొక అడ్డా ఏర్పాటు చేసుకొని పుట్టీల ద్వారా సరుకును ఏపీలోని కర్నూల్ జిల్లాకు తరలిస్తున్నారు. ఇక్కడకు మద్యాన్ని తరలించే క్రమంలో వారు వాహనాలను చాలా వేగంగా నడుపుకుంటూ వస్తున్నారని, ఎవరైనా నిలిపే ప్రయత్నం చేసినా లెక్కచేయకుండా వెళ్లిపోతున్నారని, ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.



కర్ణాటక వైపు నుంచి వస్తున్న బస్సుల్లో తనిఖీలు చేస్తున్న ప్రత్యేక నిఘా బృందాలు

జీరో పాయింటే కేంద్రంగా..

మద్యం దాటించడంలో, దందా సాగించడంలో తుమ్మిళ్లదే కీలకపాత్రగా చెప్పవచ్చు. తుమ్మిళ్లను దాటుకుని నీరు సుంకేసుల డ్యాం వైపునకు వెళ్తుంది. కానీ నదిలో బ్యాక్ వాటర్ మొత్తం తుమ్మిళ్ల వైపే వచ్చి ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మించారు. లిఫ్టుకు నది నుంచి నీరు వెళ్లే మార్గాన్ని జీరో పాయింట్‌గా పిలుస్తారు. ఈ జీరో పాయింట్, దాని పరసరాల నుంచి పుట్టీల ద్వారా నది దాటేందుకు సులువుగా ఉండటమే కాక, నది అవతలి గ్రామాలు కూడా ఎక్కువగా కలుస్తాయి. నది అవతల వైపు ఉన్న పల్‌దొడ్డి,రంగాపురం, ముడుమాల తదిదర గ్రామాలకు సరుకు పంపితే గ్రామాలకు దగ్గరలో పోలీసుల పెట్రోలింగ్ ఉండకపోవడం, సంబంధిత స్టేషన్ నుంచి ఆ గ్రామాలకు చేరుకునేందుకు సమయం పట్టడం, పోలీసుల కన్ను కప్పి మద్యాన్ని తరలించే దారులు ఎక్కువగా ఉండటం వల్ల ఈ గ్రామాల ద్వారా దందా బాగా నడుస్తుందని సమాచారం.



తుమ్మిళ్ల లోని తుంగభద్ర నది వద్ద కర్ణాటక మందు దాటించే జీరో పాయింట్

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు ఏర్పాట్లు

గద్వాల: ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు **నిర్వహించే టెక్నికల్** సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ)కు **జిల్లాలో అన్ని ఏర్పాట్లు** పూర్తి చేశామని డీఈఓ **సిరాజుద్దీన్ తెలిపారు.** లోయర్, మయ్యర్, **డ్రాయింగ్, టైలరింగ్,** ఎంబ్రాయిడరీ పరీక్షలు **ఉంటాయన్నారు.** ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందే రావాలని సూచించారు. టైలరింగ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కుట్టు మిషన్లను వారి వెంట తెచ్చుకోవాలన్నారు.

ర్యాలంపాడు పునరావాస కేంద్రం పరిశీలన



ధరూరు: కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు మండలంలోని ర్యాలంపాడు పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, తహసీల్దార్‌తో కలిసి పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం ప్రారంభమవుతాయని టెండర్లకు ఆహ్వానిస్తున్నామన్నారు. గుట్ట ప్రాంతం మరియు లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్లాట్లను ఉపయోగంలోకి తీసుకువచ్చి త్వరలోనే పునరావాస కేంద్రం పనులు ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల క్రైం: కాంట్రాక్ట్ పద్ధతిన మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, బీయూఎంఎస్ పూర్తి చేసి మెడికల్ కౌన్సిల్ నందు రిజిస్ట్రేషన్ అయిన వారు అర్హులని, ఈ నెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్



గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు లోక్ అదాలత్ చైర్మన్, జిల్లా జడ్జి కనకదుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. ఏళ్లుగా కోర్టుల్లో పరిష్కారానికి నోచుకోని పెండింగ్ కేసుల విషయంలో ఇరువురు కక్షిదారుల సమ్మతి మేరకు రాజీకి తగ్గ కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు



గద్వాల క్రైం: మహా శివరాత్రిని పురస్కరించుకుని గద్వాల డిపో నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేది నుంచి 19వ తేది వరకు భక్తులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా అలంపూర్ జోగుళాంబ దేవాలయానికి కర్నూల్ నుంచి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,066

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శుక్రవారం 670 క్వింటాళ్ళ వేరుశనగ రాగ, క్వింటాలుకు గరిష్టం రూ.8066, కనిష్టం రూ. 4239, సరాసరి రూ. 7000 ధరలు లభించాయి. దీంతోపాటు 7 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్టం రూ. 6240, కనిష్టం రూ.5860, సరాసరి రూ. 5860 ధరలు పలికాయి. వీటితోపాటు 12 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్టం రూ. 6769, కనిష్టం రూ. 6489, సరాసరి రూ. 6689 ధరలు వచ్చాయి.

పప్పుధాన్యాలతో పోషక ప్రయోజనాలు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో శుక్రవారం అంతర్జాతీయ పప్పుధాన్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏఈఓ భరత్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు పప్పు దాన్యాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ధాన్యాలలో పప్పుధాన్యాలు ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉన్నాయన్నారు. ఆహార భద్రత, పోషకాహారం కోసం ఉద్దేశించిన స్థిరమైన ఆహార ఉత్పత్తిలో భాగంగా పోషక ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. వివిధ రకాల పప్పుదాన్యాల వల్ల వచ్చే పోషకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

నేటినుంచి పద్య నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, మన్యంకొండ దేవస్థానం సహకారంతో శనివారం నుంచి 15వ తేదీ వరకు మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళా నాట్యమండలి అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి శాస్త్రీయ నృత్య ప్రదర్శన, శ్రీకృష్ణ రాయబారం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ఉంటుందని తెలిపారు. 12న శ్రీకృష్ణ రాయబారం, ధర్మజ రాజసూయం, 13న శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధఘట్టం, మాయల పకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం, 14న శ్రీకృష్ణ రాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, 15వ తేదీన భజనలు, హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

మార్చి వరకు 'మన బడి' పనులు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: వచ్చే నెల మార్చి నెలాఖరి నాటికి మన ఊరు– మనబడి కింద చేపట్టిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరెట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 161 పాఠశాలల్లో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్‌సబ్ సెంటర్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. దీంతోపాటు పదేళ్ల పూర్తయిన కారణంగా ప్రతిఒక్కరూ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహన్, పంచాయతీ రాజ్‌శాఖ శివకుమార్, డీఈఓ షీరాజుద్దీన్, డీఆర్‌డీఓ ఏపీడీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రావాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కర్ణాటకలోని బెంగళూరులో ఈనెల 12న జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపికైన పీయూ క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. అంతకుముందు వారికి పరీక్షల నిర్వహణ అధికారి డా.రాజ్‌కుమార్, ఐయూటీ కార్యదర్శి, పీయూ పీడీ కె.బాల్‌రాజ్‌తో కలిసి ట్రాక్‌షూట్, క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జట్టులోని క్రీడాకారులు బాగా రాణించి విజయంతో పీయూకి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. అందరూ క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా టీం కోచ్, మేనేజర్ దివ్యశ్రీ, పీఈటీ శ్వేత పీయూ సిబ్బంది శ్రీనాథ్, నరేష్, మన్యం తదితరులు పాల్గొన్నారు.



సిడెపై ఊరేగిన జగజ్జనని


- పోలేపల్లికి పోటెత్తిన భక్తులు
- 50 అడుగుల ఎత్తులో రథాన్ని లాగుతూ దేవాలయం
- చుట్టూ ప్రదక్షిణ అమ్మవారికి బండారు చల్లి తరించిన జనం – కోస్గి

8లో..

వాల్మీకుల కల నెరవేర్చిన ప్రభుత్వం

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి బోయల దశాబ్దాల కలను నెరవేర్చిందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు డాక్టర్ వీఎం అబ్రహం, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శుక్రవారం కలిసినట్లు తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వాల్మీకి బోయలతోపాటు మరి కొన్ని కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మాణం చేయడంతో జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలు, వాల్మీకి సంఘం నాయకులు సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయంతో వాల్మీకి బోయల కృషి ఫలించిందన్నారు. ఇదిలాఉండగా, సీఎం కేసీఆర్‌ను వాల్మీకి బోయ ఐక్య కార్యచరణ కమిటి సభ్యులు శుక్రవారం కలిసి ఏకగ్రీవంగా తీర్మాణం చేసి అమోదించడంతో కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్‌ది మోసపూరిత పాలన



మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల: రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, సీఎం కేసీఆర్ సాగిస్తున్న అబద్ధపు, మోసపూరిత పాలనను అంతమొందించాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. 'ప్రజాగోస– బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గద్వాల మండలం కాకులవరంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు ప్రజలంటే లెక్కలేకుండా పోయిందని, ఇక్కడి ఎమ్మెల్యే సైతం నేనే రాజు అనేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే రూ.5 లక్షల కోట్ల అప్పులున్న రాష్ట్రంగా తెలంగాణను మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు విన్నవించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. స్వరాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న అన్నదాతలను ఆదుకోకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడి రైతులకు పరిహారం చెల్లించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను సర్పంచులకు తెలియకుండా ఖర్చు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్‌తో ప్రజలు విసిగిపోయారని, ఈసారి ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అవినీతిని ప్రజలకు వివరించి చైతన్యపరుస్తామన్నారు. ప్రధాని మోదీ ఎనిమిదిన్నర ఏళ్ల పాలనలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసి దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామంజనేయులు, పార్టీ నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రారెడ్డి, యల్లప్ప, తుమ్మలనర్సింహులు, బాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం

- కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయింపు
- అలంపూర్ ఏడీఈ కార్యాలయం వద్ద నిరసన
- స్తంభించిన రాకపోకలు



అలంపూర్ చౌరస్తాలో ఏడీఈతో మాట్లాడుతున్న రైతులు



మిట్టదొడ్డి స్టేజ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

అలంపూర్/గట్టు: కరెంట్ కోతలపై గట్టు, ఉండవెల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కర్నూలు–రాయచూర్ అంతర్ రాష్ట్ర రహదారిపై గట్టు మండలంలోని మిట్టదొడ్డి స్టేజీ దగ్గర రైతులు రోడ్డుపై బైటాయించి రెండు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. కరెంట్ కోతలు విపరీతంగా ఉన్నాయని, ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ కట్ చేస్తున్నట్లు ముచ్చోనిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ముచ్చోనిపల్లె, తుమ్మలపల్లి, మిట్టదొడ్డి, చాగదోన గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. యాసంగిలో నీటి వసతి ఉన్న చోట వరి, మిర్చి, వేరుశనగ, మినుములు, ఆముదాల పంటలను సాగు చేసుకున్నామని, కరెంట్ కోతల కారణంగా చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోయారు. ఇలా అయితే పంటలను ఎండగొట్టుకోవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు గంటల పాటు రైతులు కరెంట్ కోతలపై ఆందోళన నిర్వహించడంతో ఇరు వైపులా వాహనాలు బారులు తీరాయి. పోలీసులు రైతులకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడించిన అనంతరం రైతులు ఆందోళన విరమించారు.

ఏడీఈతో రైతుల వాగ్వాదం

అలంపూర్ చౌరస్తాలోని ఏడీఈ విద్యుత్ కార్యాలయం వద్ద ఉండవెల్లి మండలంలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికి క్షేత్ర స్థాయిలో పంటలు ఎండిపోతున్న వ్యవసాయ కరెంట్ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడీఈ మహ్మమద్ చిన్న మక్బుల్‌ను రైతులు కలిసి తమ బాధన వ్యక్తం పరిచారు. సీఎం కేసీఆర్ రైతులకు నిరంతరం కరెంట్ ఇస్తున్నమని అసెంబ్లీ చెబుతున్నారన్నారు. కానీ మాకేందుకు కరెంట్ కోతలు విధిస్తున్నారని ఏడీఈని ప్రశ్నించారు. కరెంట్ ఇవ్వమని చెబితే మేము ఇక్కడిదాక వచ్చే అవకాశం ఉండదు కదా సక్రమంగా సరఫరా చేస్తారా లేదో తేల్చి చెప్పాలన్నారు. ఏడీఈ మాట్లాడుతూ...కరెంట్ ఉత్పత్తితో వచ్చిన సమస్యల కారణంగా ఒకటి రెండు రోజులు ఇబ్బందిగా ఉన్నట్లు తెలిపారు. రేపటి నుంచి రైతులకు ఇబ్బందులు లేకుండా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇస్తామన్నారు.

24 గంటల విద్యుత్ ఉత్తిదే..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తామంటున్న మాట ఉత్తిదే అని బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి ఆరోపించారు. మిట్టదొడ్డి స్టేజీ దగ్గర కరెంట్ కోతలపై రైతులు చేస్తున్న ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఆయనతోపాటు, నాయకులు నర్సింహులు, లక్ష్మీరెడ్డి, ఉరుకుందు మాట్లాడుతూ.. విద్యుత్ ఇక్కట్లు ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవిలో మరింత కరెంట్ కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆరోపించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

గట్టు: మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డి చెందిన రైతు మల్లేష్ (36) శుక్రవారం ఉదయం పొలం వద్ద బోరు మోటార్‌ను ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుతాఘాతానికి గురయ్యాడు. చుట్టు పక్కల వారు విషయాన్ని గమనించి, హుటాహుటిన ఇందువాసి గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతునికి భార్య సరోజమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పరామర్శించారు.

బైకును ఢీకొన్న కారు: వ్యక్తి మృతి

రాజాపూర్: బైకుపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖానాపూర్ పంచాయతీ పరిధిలోని సోమ్లానాయక్‌తండాకు చెందిన సంతోష్(27) గురువారం రాత్రి రంగారెడ్డిగూడలో తన చికెన్‌సెంటర్‌ను మూసి రాత్రి తన గ్రామానికి తన బైక్‌పై బయలుదేరాడు. రాజాపూర్ శివారులో జాతీయ రహదారిపై యూటర్న్ చేస్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొంది. సంతోష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టాలు దాటుతుండగా ఢీకొన్న రైలు

- యువకుడు మృతి

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డ సమీపంలో రైలుపట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొనడంతో మహమ్మద్ అతీఫ్‌ముహీబ్ (20) మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలియజేశారు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా భావించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహం భద్రపర్చామని తెలిపారు. కుటుంబ సభ్యులు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇంటినుంచి బయటకు వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. తెలకపల్లి, నాగర్‌కర్నూల్, బల్మూరు తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు రఘుపతిపేట నుంచి ఇసుకను తరలిస్తున్నాయి. శుక్రవారం చేసిన దాడుల్లో 3 ఇసుకతో కూడిన ట్రాక్టర్లు, మరో మూడు ఖాళీ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

తెలకపల్లి: సారా తయారీ కోసం విక్రయించడానికి దాచి ఉంచిన నల్లబెల్లం, పటికను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం సూరాపూర్ చెందిన మూడావత్ రాజు తన వ్యవసాయ పొలంలో బావి వద్ద 86 బ్యాగుల నల్లబెల్లం, పౌడర్, 4 బ్యాగుల్లో పటిక దాచి ఉంచారు. పక్కా సమాచారంతో శుక్రవారం గ్రామంలోఎక్సైజ్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎట్టకేలకు నిలిచిన 'తుంగభద్ర ఎక్స్‌ప్రెస్'



దేవరకద్ర: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం తుంగభద్ర, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి కృషి ఫలితంగానే దేవరకద్ర జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఉదయం 7:20 గంటలకు కర్నూల్ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఇక్కడ నిలిపారు. అలాగే సాయంత్రం 4:30 గంటలకు కర్నూల్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపారు. దీంతో తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి పూజలు చేశారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవరకద్ర నుంచి కాచిగూడ వరకు కేవలం రూ.60 మాత్రమే టికెట్ ధర ఉందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జట్టి నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, చల్మారెడ్డి, ఈవో సీత్యానాయక్ పాల్గొన్నారు.

సిడెపై ఊరేగిన జగజ్జనని

- పోలేపల్లికి పోటెత్తిన భక్తులు
- 50 అడుగుల ఎత్తులో రథాన్ని లాగుతూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణ
- అమ్మవారికి బండారు చల్లి తరించిన జనం



సిడెను మొక్కుతున్న భక్తులు



కోస్గి: మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం జనసంద్రంగా మారింది. శుక్రవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిడె (రథోత్సవం) నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనపు పటువలతో, కోడి పుంజులతో, వేపాకులు ధరించి శివసత్తుల పూనకాలతో, డప్పుల మోతల నడుమ పూజలు చేసి, ప్రసన్నాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక భక్తుల రాకతో ప్రాంగాణమంతా జనంతో కిటకిటలాడింది. ఎల్లమ్మ మాతాకి జై.. మావురాల ఎల్లమ్మ మాపై కరుణ చూపమ్మ అంటూ.. భక్తులు సిడె ఘట్టంలో పసుపు బండారు చల్లుతుండగా జగజ్జనని సిడెపై ఊరేగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకొని సాయంత్రం కన్నుల పండగగా సిడెను భక్త కోటి తిలకించి తరించారు. అమ్మవారికి బండారు చల్లుతూ ఎల్లమ్మ నామస్మరణతో తరించిపోయారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో ఉంచి సుమారు 50అడుగుల ఎత్తులో నుంచి రథాన్ని లా గుతూ దేవాలయం చుట్టు ప్రదక్షిణ చేయించారు.

ఎల్లమ్మను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఈఓ రాజేందర్, ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



ఆలయంలో హారతి ఇస్తున్న పూజారి



పూజల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు

ఉత్సవాలకు భారీ బందోబస్తు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్, మహిళ పీసీలు, హోంగార్డులు, ఇతర ప్రత్యేక సిబ్బంది విధులు నిర్వహించారు. దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు కాకుండా నిఘా ఏర్పాటు చేశారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెళ్లిలో ఫొటో గొడవ

- కొట్టుకున్న వరుడి స్నేహితులు, వధువు బంధువులు

నవాబుపేట: పెళ్లి కోసం వచ్చిన బంధువులు, స్నేహితుల మధ్య ఫొటో దిగేందుకు వాగ్వివాదం చోటుచేసుకొని గొడవకు దారితీసిన ఘటన మండలంలోని లోకిరేవు గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరుడు గొర్రెంక సుధాకర్ స్నేహితులు ఫొటో దిగేందుకు స్టేజీ పైకి వెళ్తుండగా, అమ్మాయి తరపు బంధువులు అదే సమయంలో మేము ఫొటో దిగుతామని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ మొదలై మాటామాట పెరిగి కర్రలు, రాళ్లతో కొట్టుకునే వరకు వెళ్లింది. ఈ ఘటనలో కావేల వెంకటయ్య, నర్సింహులు, కేశవులు, బాలకిష్టయ్య గాయపడ్డారు. గాయపడిన వారు పోలీస్‌స్టేషన్‌లో దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

నేటినుంచి పద్య నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, మన్యంకొండ దేవస్థానం సహకారంతో శనివారం నుంచి 15వ తేదీ వరకు మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళా నాట్యమండలి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి శాస్త్రీయ నృత్య ప్రదర్శన, శ్రీకృష్ణ రాయబారం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ఉంటుందని తెలిపారు. 12న శ్రీకృష్ణ రాయబారం, ధర్మజ రాజసూయం, 13న శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధఘట్టం, మాయల పకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం, 14న శ్రీకృష్ణ రాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, 15వ తేదీన భజనలు, హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

సీనియర్ నేషనల్ పోటీలో అనన్యశ్రీ ఘనత

- కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం
- బంగారం పతకం కైవసం



సీనియర్ నేషనల్ విన్నర్ ట్రోఫీతో అనన్యశ్రీ

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్ క్రీడలో అరుదైన ఘనత సాధించింది. అసోం రాష్ట్రం గౌవహటిలో ఈనెల 2వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించిన 71వ ఉమెన్ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు కేరళ రాష్ట్ర జట్టుకు ఈమె ప్రాతినిథ్యం వహించింది. సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కేరళ మహిళా జట్టు విజేతగా నిలవడంతో అనన్యశ్రీ బంగారు పతకం సాధించింది.

పలు సార్లు జాతీయస్థాయిలో ప్రతిభ

అనన్యశ్రీ తెలంగాణ, కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించడం విశేషం. రాష్ట్రం నుంచి అనన్యశ్రీ 2018 పంజాబ్ (చండీఘర్)లో జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించింది. 2019లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి, 2020 కడపలో జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళ రాష్ట్ర తరపున గతేడాది ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్‌లో 23వ జాతీయస్థాయి, మహారాష్ట్ర సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌లో 24వ జాతీయస్థాయి యూత్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళలో సాత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, మహారాష్ట్ర కొల్హాపూర్‌లో సీనియర్ లీగ్ (హరియంట్ చసాక్) వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంది. ఈ మూడు టోర్నీల్లో కేరళ జట్టు విన్నర్‌గా నిలిచింది.

ప్రభుత్వం 'ధరణి'ని రద్దు చేయాలి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి సైట్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెబ్‌సైట్‌లో మార్పులు చేర్పులు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఒకరి భూములు మరొకరి పేరుపై వెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న తుగ్లక్ పాలనలో మంత్రులు ఎమ్మెల్యేలు నిమిత్త మాత్రమే అని విమర్శించారు. శ్రీశైలం ఎడమ కాల్వలో నీటి చౌర్యాన్ని అడ్డుకోకపోతే రాబోయే నెలలో తాగు, సాగునీటికి కటకట ఏర్పడుతుందని, ఎమ్మెల్యేలు, మంత్రులు వెంటనే స్పందించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఏమి చేయలేదని పేర్కొనడం దారుణమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సంస్కరణలు అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. సమస్యలతో దేశం సతమతమవుతున్నా ప్రధాని మాత్రం ఆదాని, అంబానీలకు ప్రజాధనాన్ని కట్టబెట్టేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో శశిధర్‌రెడ్డి, రవి, రోహిణి, గోవర్దన్‌రెడ్డి, సుమిత్ర, నారాయణగౌడ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్ల బస్తాల్లో కంకర రాళ్లు

- 112 బస్తాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

జడ్చర్ల టౌన్: వడ్ల బస్తాల్లో కంకరరాళ్లు కలిపి విక్రయిస్తున్న ఘటన బాదేపల్లి పట్టణంలో శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రమేష్‌బాబు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, విజిలెన్స్ అధికారి బాలరాజు శుక్రవారం రాత్రి పట్టణ శివారులోని సత్యసాయి రైస్‌మిల్‌లో తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మిల్ మూసి ఉన్నప్పటికి ఆవరణలో నిల్వ చేసిన బస్తాలను పరిశీలించారు. 112 బస్తాలు ఉండగా ఒక్కో బస్తా 60కిలోలుగా ఉంది. అందులో వడ్లతో పాటు 6కిలోల కంకర రాళ్లు నింపి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. మిల్ ఆవరణలోనే పెద్ద ఎత్తున కంకర నిల్వలు గుర్తించారు. యజమాని అందుబాటులో లేకపోవటంతో ప్రస్తుతానికి బస్తాలు సీజ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం మిల్ తెరిచి చూస్తామని, కంకర రాళ్లతో కూడిన వడ్లను ఎక్కడికి పంపిస్తున్నది విచారిస్తామని తెలిపారు. గురువారం పట్టణంలో భారీగా కల్తీ టీ పొడి లభించగా, శుక్రవారం వడ్లల్లో కంకరరాళ్లు కలిపి ఉండటం వెలుగు చూడటంతో జడ్చర్ల కల్తీకి కేరాఫ్‌గా మారుతుందని జోరుగా చర్చించుకుంటున్నారు.



వడ్ల బస్తాల్లో కలిపిన కంకరరాళ్లు



పరిశీలిస్తున్న అధికారులు

1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,020 అడుగుల వరకు నీటి మట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 250, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

బాలిక ఆత్మహత్యకు కారణమైన బాలుడికి జైలుశిక్ష

మిడ్జిల్: బాలికను ప్రేమించి పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యకు పాల్పడడంతో అందుకు కారణమైన బాలుడికి శుక్రవారం జువైనల్ కోర్టు జైలు శిక్ష విధించింది. ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక, ఊర్కొండ మండలంలోని తండాకు చెందిన బాలుడు ప్రేమించుకున్నారు. కాగా బాలిక గర్భావతి కావడంతో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురాగా, బాలుడు అందుకు నిరాకరించాడు. దీంతో 2019లో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం జిల్లా జువైనల్‌లో కోర్టులో ప్రవేశపెట్టగా బాలుడికి మూడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ వివరించారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న వ్యక్తి రిమాండ్

నవాబుపేట: బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహబూబ్‌నగర్ రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్ఐతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కారుకొండ చెందిన బ్యాగరి బాలరాజు బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మైనర్‌లను ప్రేమ పేరుతో మోసం చేయటం నేరమని వారికి మైనార్టీ తీరితేనే వారి అంగీకారం పరిగణలోకి వస్తుందని వస్తుందని సీఐ తెలిపారు.

బోర్డు ధ్వంసం చేసిన వ్యక్తుల రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద ఉన్న 'మన మహబూబ్‌నగర్' బోర్డును ధ్వంసం చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్ తరలించినట్లు రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ వెల్లడించారు. తిమ్మాసానిపల్లికి చెందిన మోహన్, బృందావన్ కాలనీకి చెందిన నర్సింహతో పాటు మరో బాలుడు కలిసి ఈనెల 5న తెల్లవారుజామున మెట్టుగడ్డ వద్ద ఉన్న 'మన మహబూబ్‌నగర్' బోర్డును ధ్వంసం చేశారని తెలిపారు. ఇందులో మోహన్, నర్సింహను జిల్లా జైలుకు తరలించగా, బాలుడిని జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రాజీతో ఇరువర్గాలకు న్యాయం

- నేడు జాతీయ లోక్ అదాలత్
- జిల్లాలో 3,700కేసులు రాజీ కోసం గుర్తింపు

మహబూబ్‌నగర్ క్రైం: న్యాయస్థానాల్లో ఎన్నో కేసులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలను ఒకే వేదికపై హాజరుపర్చి న్యాయమూర్తుల సమక్షంలో సమస్యలను రాజీ పద్ధతిలో వెంటనే పరిష్కరిస్తారు. న్యాయ సేవల గురించి వివరాలు తెలుసుకోవాలనుకునేవారు ఉచిత హెల్ప్‌లైన్ 15100ను సంప్రదించవచ్చు. శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కేంద్రంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు.

3,700 కేసుల గుర్తింపు

జిల్లాలో లోక్ అదాలత్‌లో మొత్తం 3,700 కేసులను పరిష్కరించడానికి కోర్టుతో పాటు పోలీస్ శాఖ గుర్తించింది. రాజీ అయ్యే కేసుల్లో ప్రధానంగా క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూ తగదాలు, ఎక్సైజ్, మోటార్ వెహికల్, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ కేసుల్లో రాజీ అయ్యే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ కోర్టులో 4 బెంచీలు, జడ్చర్ల కోర్టులో ఒక బెంచీ ఏర్పాటు చేశారు. ఇప్పటికే కేసులు అధికంగా పరిష్కారం కోసం రావడానికి సంబంధిత న్యాయవాదులతో పాటు ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆర్టీసీ, బ్యాంకు, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. రాజీ అయ్యే కేసులలో ప్రధానంగా డ్రంకన్‌డ్రైవ్, ఈ-పెట్టి, ఎంవీఐ యాక్టు, డిజాస్టర్ మెనేజ్‌మెంట్ కేసులు పరిష్కారిస్తారు.



ఇలాంటి కేసుల్లో రాజీ లేదు

హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు, మైనర్లపై లైంగిక దాడులు, దొంగతనాలు, దోపీడీలు, ప్రత్యేక చట్టాలపై నమోదైన కేసులను, క్రూరమైన కేసును లోక్ అదాలత్‌లో రాజీకి వీల్లేదు.

ఖైదీలకు లోక్ అదాలత్

చిన్న నేరాలు చేసి బెయిల్ మంజూరైనప్పటికి జామీను సమర్పించకపోతే కొంత మంది నిందితులు చాలా కాలంగా జైల్లో ఉంటారు. ఇలాంటి నిందితుల గురించి ప్రభుత్వంపైనా ఖర్చు పెరుగుతుంది. న్యాయమూర్తులు స్వయంగా జైలుకు వెళ్లి అక్కడి నిందితుల కేసులను పరిశీలిస్తారు. ఖైదీలు సన్మార్గంలో జీవిస్తామని హామీ ఇచ్చి నేరం అంగీకరించడంతో కొద్దిపాటి శిక్షతో లోక్ అదాలత్ తీర్పు ఇస్తాయి. ఇలాంటి వాటిలో చాలాకాలంగా ఉంటున్న చిన్నపాటి నేరస్తులు వెంటనే విడుదలకు నోచుకుంటారు.

లోక్ అదాలత్ ద్వారా లాభాలు

- ఈ సేవలను వినియోగించుకునేందుకు రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదు.
- వీటి ద్వారా కేసులను పరిష్కరించుకుంటే దావావేసే సమయంలో కోర్టుకు చెల్లించే ఫీజులను తిరిగి చెల్లిస్తారు.
- దావా వేసిన తర్వాత సాక్షుల విచారణ, వాయిదాలతో కాలయాపన అవుతుంది. లోక్ అదాలత్‌లో తీర్పులు వెంటనే వెలువడుతాయి.
- లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం అయితే పైకోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు.
- కోర్టులోనే దావా దాఖలు చేయాలన్న నిబంధన లేదు. కోర్టులో దాఖలు కాని కేసులను స్వయంగా వచ్చి తెలిపినా ఎలాంటి ఖర్చు లేకుండా ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి పరిష్కారిస్తారు.

న్యాయ సేవాధికార సంస్థ సాయం

ప్రజలకు సమస్య ఏర్పడితే మండల, జిల్లా స్థాయిలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి వారి సమస్యను చెప్పవచ్చు. ఏదైనా తగాదా ఏర్పడితే న్యాయస్థానంలో దావా దాఖలు చేయకంటే ముందు నేరుగా న్యాయసేవా అధికార సంస్థను ఆశ్రయిస్తే ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి లోక్‌అదాలత్ కార్యక్రమం ద్వారా ఇరువర్గాల సమస్యను పరిష్కరించి వెంటనే తీర్పు చెబుతారు. ఇవే కాకుండా న్యాయస్థానాల్లో దాఖలైన కేసులను కూడా లోక్ అదాలత్ పరిష్కరించుకోవచ్చు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాం

- బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాణిరుద్రమదేవి



మాట్లాడుతున్న రాణిరుద్రమదేవి

పాలమూరు: పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాణిరుద్రమదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని మర్లులో శుక్రవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్ కేంద్రంలో పార్టీని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అందులో జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. కుటుంబ, అరాచక పాలన నుంచి ప్రజలను కాపాడటంతో పాటు బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ ఉందనే విషయాన్ని ప్రజలు నమ్ముతున్నట్లు తెలిపారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ వారి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నట్లు ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, పద్మజారెడ్డి, నారాయణయాదవ్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.